
# పిట్టల దొర

బ్రిటీష్ కాలంలో తుపాకి పరిపాలనజరుగుతుండేది. అప్పుడు ఎర్రగొల్ల కులస్తులకు చెందినవారు చెక్కతో ఒక తుపాకీ చేయించుకొని, ఖాకీ నిక్కరు ధరించి, ఖాకీ చొక్కాధరించి, కోటుధరించి తలపై దొరటోపీధరించి కాళ్లకు బూట్లుధరించి, ప్యాంటును పైకిమడతపెట్టి, నోటితో ఈలను ఊదుతూ మాటలుకోటలుదాటే విధంగా చెప్పతూ తనకు ఎంతో డబ్బువుందంటూ, ఎంతో బంగారంవుందంటూ మేడలు వున్నాయి, మిద్దెలు వున్నాయి. నేను లక్షాధికారినే కానీ భిక్షంపెట్టండి అంటూ తన తమాషా మాటలతో ప్రజలను నవ్విస్తూ, కవ్విస్తూ అలరిస్తూ మెప్పిస్తూ జీవనోపాధిచేస్తూ తన పొట్టపోసుకుంటూ ఉండేవారు. నవరసాలలో హాస్యరసం గొప్పది. అటువంటి "హాస్యాని ప్రజలకు అందించి వారిని కడుపుబ్బనవ్వించే వారే ఈ పిట్టలదొరలు. వీరి హాస్యోక్తులు ఈ విధంగా ఉంటాయి.



గుడ్‌మార్నింగ్ సార్

నేనిప్పుడే లండన్ నుంచి వచ్చాను సార్

రెండు కాళ్ల బండిపై వచ్చాను సార్

డబ్బులేని దొరగారు, యిక్కడ

మీకు ఇళ్లుకట్టించమని నన్ను పంపారు సార్

వీరి అలంకరణ, మాటలు చూడగా ఆనాటి బ్రిటీష్ పరిపాలన తుపాకీపాలనగా ఉండేది కావున ఆ పరిపాలనను సుతిమెత్తని హాస్యోక్తులతో వ్యంగ్యంగా విమర్శిస్తూ

ప్రజలను నవ్వించేవారని తెలుస్తోంది. ఈ కళారూపాన్ని బహురూపి (బైరూపి)లత్కోరుసాబ్, బుడ్డర్ ఖాన్, తుపాకీరాముడు అని కూడా పిలుస్తారు. తెలంగాణాప్రాంతాల్లో "బైరూపి" "బైరూపులోడు" అని కూడా పిలుస్తారు.

ప్రమధ పురాతన నటుచరిత్రం

క్రమమొంద బహునాటకము

లాడువాడు - లలితాంగరస

కళాలంకార రేఖల

బహురూపమాడేడివారు.

అని శ్రీ పాల్కురికి సోమనాధ కవి వ్రాసినదానినిబట్టి ఈ పిట్టలదొర కళారూపం ప్రాచీన కళారూపాలలో ఒకటని తెలుస్తోంది. అన్నమయ్యవ్రాసిన సర్వేశ్వర శతకంలోనూ, పాల్కురికి సోమనాధుడువ్రాసిన పండితారాధ్య చరిత్రలోను బహురూపాల ప్రస్తావన ఉంది.

"మీరు వస్తారని ఆకాశమంత అరుగువేయించాను సార్, పటికరాళ్ల పచ్చడి, ఉమ్మెత్త ఇగురు, ఇటుకరాళ్ల వేపుడు, లారీలకొద్దీ పులిహోర, చెరువులకొద్దీ సాంబారు, జిల్లేడుపాల పెరుగు చేయించాను సార్.... చేసినవాడేకానీ తిన్నవారు లేరు సార్...."

ఈ విధంగా హాస్యంతో కూడిన చురకలతో జనాన్ని పిట్టలదొర నవ్విస్తూంటాడు. ఈ వేషంలో ప్రజానాట్యమండలికి చెందిన అనేక దళాలు, రాజకీయ ప్రభోధం కలిగించాయి. నిజాం నిరంకుశపాలనకు నిర్వహించిన పోరాటంలో శ్రీ సుద్దాల హనుమంతరావు, శ్రీ నర్రా రాఘవరెడ్డి "పిట్టలదొర" వేషం కట్టి అశేష ప్రజల నీరాజనం పొందారు. ఇంకా చాల మంది కళాకారులు ఈ కళా రూపాన్ని ప్రచారం చేశారు, చేస్తూన్నారు. ఈ కళాకారునికి సమకాలీన సామాజికాంశాలపై అవగాహన మరియు సమయస్ఫూర్తి ఎంతైనా అవసరం.